క్లుప్తంగా

విద్యతో ఉన్నత శిఖరాలకు



విద్యార్థులతో జేసీ కార్తీక్

ఇందుకూరుపేట: విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చని జేసీ కార్తీక్ పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల్లో మండలంలో ఉత్తమ మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను డేవిస్‌పేటలో శుక్రవారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. బాలికలు బాగా చదవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్, కొత్తూరు లలితా మహేశ్వరి ఆశ్రమ పీఠాధిపతి రామాయణం మహేష్‌స్వామి, ఎంఈఓలు వెంకటేశ్వరనాయక్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమలతో ప్రమాదకర వ్యాధులు



పరిశీలిస్తున్న నాగార్జునరావు

కొడవలూరు: డ్రై డేను పాటించడం ద్వారా దోమలను నివారించుకోవాలని, లేని పక్షంలో ప్రమాదకర వ్యాధుల బారిన పడాల్సి ఉంటుందని మలేరియా జిల్లా సహాయాధికారి నాగార్జునరావు సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో స్థానిక వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రై డే.. డ్రై డే అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నీటి నిల్వల్లేకుండా చూసుకోవడంతో పాటు ప్రతి ఇంట్లో దోమల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధి పనులకెళ్లే వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలని కోరారు. ఎవరైనా వడదెబ్బకు గురై సబ్ సెంటర్‌కు వస్తే వెంటనే చికిత్సను అందించేలా అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ఎస్‌యూఓ నాగరాజు, హెచ్‌ఏ సుధాకర్, ఏఎన్ఎం హిమజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, వ్యాయామ ఉపాధ్యాయుడు అరోరా శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వెంకటాచలంలోని అక్షర విద్యాలయంలో నిర్వహించిన ఎన్‌సీసీ క్యాంపునకు తమ పాఠశాల విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. ఫైరింగ్ పోటీల్లో డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానంలో విద్యార్థి కార్తీక్ నిలిచారని చెప్పారు.

వాగు కాలువ పరిశీలన

పొదలకూరు(ముత్తుకూరు): ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముత్తుకూరు మండలం పొట్టెంపాడు వాగు కాలువను శుక్రవారం పరిశీలించారు. రెండో పంటకు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని రైతులకు సూచించారు. పొట్టెంపాడు గిరిజనుల సమస్యలను వారంలోగా పరిష్కరించడం జరుగుతుందన్నారు.

దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

అక్కడ అంకణం భూమి ధర అక్షరాలా రూ.లక్ష ఉంటుంది. జాతీయ రహదారికి అనుకుని ఉండటంతో అక్రమార్కుల కన్ను ఖాళీగా ఉన్న విలువైన ప్రభుత్వ భూమిపై పడింది. ఇరిగేషన్ కాలువను ధ్వంసం చేసి చకచకా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- ఇరిగేషన్ కాలువను ధ్వంసం చేసి అక్రమ కట్టడాలు
- టీడీపీ నాయకుల అండ
- విలువ రూ.1.50 కోట్లు
- పట్టించుకోని అధికారులు



గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద పంట కాలువను కబ్జా చేసి అక్రమ నిర్మాణ పనులు

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారి ఆనుకుని చెరువు ఉంది. హైవే, చెరువుకు మధ్యలో రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలున్నాయి. ఈ భూమిని ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తే వ్యాపారాలు చేసుకునేందుకు అనువుగా ఉంటుందని కొందరు భావించారు. పలువురు టీడీపీ నాయకుల అండతో రూ.1.50 కోట్ల విలువ చేసే సుమారు 150 అంకణాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారు. రెండు చెరువులు సాగునీరు సరఫరా అయ్యే పంట కాలువను సైతం ధ్వంసం చేశారు. ఆక్రమిత భూమిలో నాలుగు రోజుల నుంచి నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి.

అయినా ఆగలేదు

ఇరిగేషన్ కాలువ ఆక్రమణకు గురికావడంతో తమ గ్రామ చెరువులకు సారునీరు సక్రమంగా చేరే పరిస్థితి ఉండదని గ్రామ రైతులు రెండు రోజుల క్రితం ఇరిగేషన్ ఏఈ నాగజ్యోతికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె పంట కాలువను పరిశీలించి నిర్మాణాలు నిలిపివేయాలని చెప్పి వెళ్లారు. అయితే మరుసటి రోజు నుంచే మళ్లీ పనులు జరుగుతున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలున్నాయి. విలువైన ప్రభుత్వ భూమితోపాటు, పంట కాలువను ఆక్రమించడంపై స్పందించి జిల్లా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలేవీ?

రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను టీడీపీ నేతల అండతో రాత్రికి రాత్రే ఆక్రమించిన విషయాన్ని స్థానికులు చూసి విస్తుపోతున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి కాపాడుకుంటూ వచ్చిన విలువైన భూములు కబ్జాకు గురికావడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యులు తల దాచుకునేందుకు సెంటు భూమిలో గుడిసె వేస్తే వెంటనే తొలగించే అధికారులు విలువైన భూమిని దర్జాగా ఆక్రమిస్తే చర్యలు తీసుకోరా అని ప్రశ్నిస్తున్నారు. ఆక్రమణలపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కొందరు మండిపడుతున్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

గొలగమూడి క్రాస్‌రోడ్డు వద్ద ఇరిగేషన్ కాలువ ఆక్రమణల విషయం నా దృష్టికి రాలేదు. విచారణ జరిపి పంట కాలువ ఆక్రమణలు జరిగి ఉంటే వెంటనే ఆక్రమణలు తొలగిస్తాం.

– పాండురంగారెడ్డి, డీఈ, కనుపూరు కెనాల్



ప్రభుత్వ భూమిలో అక్రమంగా కట్టిన గోడ

గర్భిణులకు వైద్య పరీక్షలు

మనుబోలు: ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ)లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ గేయ పూజిత గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించామని తెలిపారు. ప్రతి నెలా 9 లేదా 10వ తేదీల్లో పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. హైరిస్క్‌తో ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. అంగన్‌వాడీల ద్వారా అందించే పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజయ్య, ఏఎన్ఎం సుభాషిణి, స్టాఫ్ నర్స్ అరుణమ్మ, సిబ్బంది రాజన్, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

- నలుగురికి గాయాలు



క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తూ..

వెంకటాచలం: ఆటో బోల్తా పడి నలుగురు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని ఆర్టీసీ జోనల్ కళాశాల సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు వైపు నుంచి వెంకటాచలం వైపు వెళ్తున్న ఆటో ఆర్టీసీ జోనల్ కళాశాల సమీపానికి చేరుకోగానే ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బాల్య వివాహాలతో దుష్పరిణామాలు



కొడవలూరు: అవగాహన కల్పిస్తున్న పద్మావతి



పొదలకూరు: పులికల్లులో పోస్టర్ల ఆవిష్కరణ



పొదలకూరు: వరదాపురంలో..

కొడవలూరు: బాల్య వివాహాలతో సంభవించే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాన్ని యల్లాయపాళెం – 3 అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలబాలికలకు శుక్రవారం నిర్వహించారు. కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగితే వెంటనే సమాచారమివ్వాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్త నీరజ తదితరులు పాల్గొన్నారు.

- పొదలకూరు: బాల్య వివాహాల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పులికల్లు అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాస్ – వేసవి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ర్యాలీ చేపట్టారు. బాల్య వివాహాలను అరికట్టాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ సంగీత, అంగన్‌వాడీ టీచర్ ఎస్.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వరదాపురం అంగన్‌వాడీ కేంద్రంలో శిక్షణను సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ నిర్వహించారు. పోస్టర్లను ఆవిష్కరించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. జూన్ 10వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళా పోలీసులు సౌజన్య, శ్రీలత, ఏఎన్ఎం పెంచలమ్మ, వీఓఏ రామలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు రోహిణి, శరణ్య, రాజేశ్వరి, ప్రమీల, భారతి పాల్గొన్నారు.
- తోటపల్లిగూడూరు: బాల్య వివాహాలను అరికట్టాలని ఇందుకూరుపేట సీడీపీఓ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని వరకవిపూడి సచివాలయంలో శుక్రవారం కిశోరి వికాస్ – వేసవి శిక్షణపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ సుమలత, ఏఎన్ఎం పోలమ్మ, సూపర్‌వైజర్ రంగమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సువార్తమ్మ, కవిత, రాజేశ్వరి, అరుణ, ప్రసన్న పాల్గొన్నారు.
- మనుబోలు: బాలికల బంగారు భవిష్యత్ కోసమే కిశోరి వికాసం కార్యక్రమం చేపట్టినట్లు ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. మనుబోలు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని బాగా చదువుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడం చట్ట ప్రకారం నేరమన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, అంగన్‌వాడీలు విజయలక్ష్మి, సుగుణమ్మ, నిర్మల, ఆశా కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు: మాట్లాడుతున్న సీడీపీఓ



మనుబోలు: పోస్టర్ల ప్రదర్శన

రామాలయ శంకుస్థాపనకు ఏర్పాట్లు



జేసీబీతో పనులు

పొదలకూరు: పట్టణంలో రామమందిరం స్థానంలో రామాలయం నిర్మాణానికి ఉభయకర్తలు, భక్తులు ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారు. ఈనెల 11వ తేదీన ఉదయం శంకుస్థాపన చేయనున్నట్టు వెల్లడించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన మందిరాన్ని ఇటీవల తొలగించారు. అంతకుముందు బాలాలయం నిర్మించి మందిరంలోని పటాలు, విగ్రహాలను అక్కడకు చేర్చారు. 10వ తేదీన కరసేవలకులతో ర్యాలీ నిర్వహించి మరుసటిరోజున శంకుస్థాపన మహోత్సవం చేస్తారు.

గుండెపోటు లక్షణాలపై అవగాహన అవసరం



ఇందుకూరుపేట: గుండెపోటు లక్షణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇందుకూరుపేట సామాజిక ఆరోగ్య కేంద్ర సూపరింటెండెంట్ సునీల్ పేర్కొన్నారు. గుండెపోటు లక్షణాలపై సీహెచ్‌సీ పరిధిలోని ఏఎన్ఎంలు, ఆశ వలంటీర్లకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అవసరమైతే మొదటి గంటలోనే రూ.45 వేల విలువ జేసే ఇంజెక్షన్‌ను ఉచితంగా అందజేయనున్నారని వివరించారు. మెరుగైన వైద్యం చేయించుకునే అవకాశం ప్రభుత్వాస్పత్రుల్లో ఉందని పేర్కొన్నారు. వైద్యాధికారులు జైపాల్‌రెడ్డి, ప్రసన్న, మౌనిక, విజయకుమార్‌రెడ్డి, శౌర్య తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్లలో స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

పొదలకూరు: లేఅవుట్లలో ప్రజాప్రయోజనాల కోసం కేటాయించే స్థలాలను ఆక్రమించినా, కొంతకాలం తర్వాత క్రయ, విక్రయాలు జరిగినా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వివాదాస్పదంగా మారిన సత్యనారాయణ లేఅవుట్లోని 286 అంకణాల స్థలాన్ని ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సెంబ్‌కార్ప్ కంపెనీ యాజమాన్యం రూ.43 లక్షలతో అందజేసిన జనరేటర్, డెంటల్ ఎక్స్‌రే యూనిట్, కంప్యూటర్లు, ఇన్వర్టర్, ఏసీలు, వాటర్ డిస్పెన్సరీలు తదితరాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా సీహెచ్‌సీ వైద్యాధికారులకు అందజేశారు. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

సింహవాహనంపై నృసింహుడు

నెల్లూరు సిటీ: నరసింహకొండలోని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సింహవాహనంపై నృసింహుడు శుక్రవారం దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా హాజరయ్యారు.

కోనలో వైభవంగా బ్రహ్మోత్సవాలు



మహిళలకు కొడిముద్దలను అందిస్తున్న అర్చకులు

రాపూరు: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామి, అమ్మవార్లకు క్రేన్ మండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పీఠంపై ఉంచి పాలు, తేనె, నెయ్యి, పెరుగు, పండ్ల రసాలు, చందనం, పసుపు, కుంకుమ, కొబ్బరినీరు తదితర ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు.

వైభవంగా ఊంజల్ సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిలను తిరుచ్చిలో కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. 1008 సహస్ర దీపాలంకరణ మండపంలో ఉంచి ఊంజల్‌సేవ నిర్వహించారు. దీనిని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు.



స్నపన తిరుమంజనం



స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

రైలు ప్రయాణం.. జాగ్రత్త

- నేరాల అదుపునకు చర్యలు
- గస్తీని కట్టుదిట్టం చేసిన రైల్వే పోలీసులు



డ్రోన్‌తో నిఘా (ఫైల్)



నేర నియంత్రణ చర్యలపై ముద్రించిన కరపత్రాలను అందజేస్తున్న రైల్వే పోలీసులు

నెల్లూరు(క్రైమ్): వేసవిలో రైళ్లలో దోపిడీలు, దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో రైల్వే పోలీస్ శాఖ అప్రమత్తమైంది. నేర నియంత్రణకు పటిష్ట చర్యలను నెల్లూరు రైల్వే డీఎస్పీ మురళీధర్ పర్యవేక్షణలో సీఐ సుధాకర్ చేపట్టారు. గస్తీని సివిల్, ఆర్పీఎఫ్ పోలీసుల సహకారంతో కట్టుదిట్టం చేశారు. అన్ని రైళ్లలో బీట్లను ఏర్పాటు చేశారు. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలపై నిఘా పెంచారు. డ్రోన్లతో నిశితంగా పరిశీలిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, పాతనేరస్తుల కదలికలపై నిఘా పెంచారు. మరోవైపు రైల్వేస్టేషన్లు, రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. నేర నియంత్రణ చర్యలపై ప్రయాణికులకు కరపత్రాలు, ప్లకార్డులతో పాటు పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా స్క్వాడ్లతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. నేర నియంత్రణకు తాము చేపడుతున్న చర్యలకు సహకరించాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేస్తున్నారు. చైతన్యంగా మెలగాలని సూచిస్తున్నారు.

అత్యవసర వేళ..

రైల్వే హెల్ప్‌లైన్:	139
పోలీస్ కంట్రోల్ రూమ్:	112
నెల్లూరు రైల్వే డీఎస్పీ:	94906 17930
సీఐ:	94406 27645
నెల్లూరు ఎస్సైలు:	94406 27644, 99496 65977
గూడూరు:	94406 27643
కావలి:	94406 27648



రైల్వేస్టేషన్లో తనిఖీలు

పాటించాల్సిన జాగ్రత్తలు..

- రైలు ప్రారంభమయ్యే సమయంలో బోగీ తలుపు వద్ద నిలిచి ఉండటంతో గొలుసులు, సెల్‌ఫోన్లను దొంగలు లాక్కెళ్లే ప్రమాదముంది. సాధ్యమైనంత వరకు ద్వారం వద్ద నిలవకూడదు.
- ప్రయాణ సమయంలో ఎక్కువ బంగారు ఆభరణాలను ధరించడం మంచిదికాదు. ఒకవేళ ధరించినా, అవి బయటకు కనిపడకుండా చూసుకోవాలి.
- డబ్బు, నగలు, గ్యాడ్జెట్లు తదితర విలువైన వస్తువులను బ్యాగ్‌లో కాకుండా లోపలి జేబుల్లో భద్రపర్చుకోవాలి. బ్యాగ్‌లను పక్క వారికి అప్పగించడం, రైల్లోనే వదిలేసి ప్లాట్‌ఫారంపైకి వెళ్లకూడదు.
- యాంటీ థెఫ్ట్ బ్యాగ్‌లు, తాళాలను ఉపయోగించాలి. సీటు కింద ఉన్న లగేజీకి చైన్ లాక్‌ను ఉపయోగించాలి
- నేరస్తులు సహచర ప్రయాణికుల ముసుగులో నేరాలకు పాల్పడే అవకాశం ఉంది. వీరి మాటలను ఎట్టి పరిస్థితుల్లో విశ్వసించకూడదు.
- అపరిచిత వ్యక్తులిచ్చే ఆహార పదార్థాలు, పానీయాలను తీసుకోకపోవడం మంచిది.
- రాత్రి వేళ బోగీ తలుపులు, కిటికీలను మూసుకోవాలి.
- ప్రయాణ వివరాలు లేదా ఆర్థిక పరిస్థితిపై అనవసరంగా ఇతరులకు తెలియజేయరాదు.
- అత్యవసర నంబర్లను సెల్‌ఫోన్లో ముందుగానే సేవ్ చేసుకోవాలి.

ఉత్తర్వుల మేరకు జాబితా విడుదలకు వినతి



నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయుల పదోన్నతుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, పిచ్చిబాబు కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావుకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. జిల్లాలో తెలుగు, ఉర్దూ, ఎస్జీటీ పోస్టులను నిబంధనల మేరకు మంజూరు చేయాలని కోరారు.